సహోదరుడు బలరాముడు కంటే నా భక్తులు అంటే నాకు ఎక్కువ ఇష్టం రుక్మిణీ!" అంటాడు కృష్ణుడు. అంటే భక్తులకు స్వాధీనమవుతాడు. అనేక జన్మల నుండి మీరు ప్రార్థించగా, ప్రార్థించగా, స్మరించగా స్మరించగా, ఆరాధించగా ఆరాధించగా ఈశ్వరుడే కాళ్ళు చేతులు తొడుక్కొని మానవరూపంలో వస్తాడు, వాడు మనం ఒక్కటే అనుకొంటాము, వాడికి మనకు లోపల ఎంతదూరం ఉందో మనకు తెలియదు. దేహంలో ఉండు, దేహంలో ఉన్నా ఆ దేహం మీది అనుకోవద్దు, మీరు కానిదానిని మీరు అనుకోవద్దు, ఒకవేళ మీది అనుకొన్నా దేహం మిమ్మల్ని విడిచిపెట్టి వెళ్ళిపోతుంది. ఈ ఒక్క వాక్యం చాలు మనం తరించటానికి, మనకు వైరాగ్యం రావటానికి సహాయసహకారములు అందిస్తుంది.

గురువు మనలో అంతర్యామిగా ఉంటాడు. నీలోని బలహీనతలను చూస్తూ ఉంటాడు, నిన్ను యాగీ చేయడు, లోపల ఉన్న వస్తువు గోచరం అవ్వకుండా నీలో ఏ ఆటంకాలు అయితే ఉన్నాయో వాటిని నెమ్మదిగా తొలగిస్తాడు. ఆయన ఏ స్థితిలో అయితే ఉన్నాడో ఆ స్థితికి వెళ్ళేవరకు ఈ జన్మలోనే కాదు, రాబోయే జన్మలో కూడా నిన్ను విడిచిపెట్టడు, వాడు గురువు. ఒకవేళ నీవు గురువును విడిచిపెట్టినా, ఆయన నిన్ను విడిచిపెట్టడు. ఆయన మాట అనుగ్రహం, చూపు అనుగ్రహం, శరీరం ధరించి ఉండటం అనుగ్రహం, వాడు గురువు. నీలో ఉన్న బలహీనతలను తొలగించు కోవటం నీకు భారం అవ్వవచ్చుకాని అది వాడికి భారం కాదు. నీలో ఎన్ని బలహీనతలు ఉన్నా అన్నింటినీ తొలగిస్తాడు. లోపల సిద్ధంగా ఉన్న వస్తువును నీకు సిద్ధింప చేస్తాడు, వాడు గురువు. ఎవరిని అనుకరించవద్దు, నీ పద్ధతిలో నీవు ప్రయత్నం చేసి తరించు. జీవితంలో ఏదైనా సాధించినప్పుడు నేను సాధించాను అనుకొంటే అది భగవంతుడిని అగౌరవపరచినట్లు అవుతుంది. నీవు అంటూ ఒకడివి ఉన్నావా సాధించటానికి. నీ సాధనలో మనస్సును ఇన్వాల్వ్ చెయ్యి, ఎందుచేతనంటే మనస్సు కరిగితేనేకాని నీకు బ్రాహ్మీస్థితి రాదు. తెర బాగా పల్చగా ఉంటే ఆ ప్రక్కన ఉన్నవాడు ఈ ప్రక్కకు కనబడతాడు. మనస్సు చిరగకపోయినా కనీసం అంత పల్చగా చేసుకొంటే లోపల ఉన్న పరమాత్మ నీకు గోచరిస్తాడు, మిగతాపని ఆయన చూసుకొంటాడు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 07-11-05, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

దీపావళి గురించి రెండు కథలు చెపుతారు. నరకచతుర్ధశి రోజున వాసుదేవుడు నరకాసురుడిని సంహరించాడని, ఆ రాక్షస సంహారం అయిన తరువాత మరుసటి రోజున దీపావళి పండుగ చేసుకొన్నారని చెపుతారు. ఉత్తరప్రదేశ్‌లో ఇంకోరకంగా చెపుతారు.

రాముడు అరణ్యవాసం పూర్తిచేసుకొని దీపావళి రోజున అయోధ్యకు వచ్చాడు కాబట్టి ఆ రోజున అక్కడ దీపాలు వెలిగించి, బాణాసంచా కాల్చి పండుగ చేసుకొన్నారని చెపుతారు. దీపం జ్ఞానానికి గుర్తు. దీపం చీకటిని పోగొడుతుంది, జ్ఞానం అజ్ఞానాన్ని పోగొడుతుంది. అందుచేత పూజ చేసుకొనేటప్పుడు ముందుగా దీపం వెలిగిస్తారు. మనం ఏమిచేయాలి అంటే శ్రీరామచంద్రమూర్తిని మన హృదయంలోనికి ఆహ్వానించి అక్కడ నిలుపుకోవాలి, ఆయనను ఆరాధించుకోవాలి, జపించుకోవాలి. మనం ఏదైనా మంచిపనులు చేస్తే పుణ్యం వస్తుంది, చెడ్డపనులు చేస్తే పాపం వస్తుంది. ఇవన్నీ లోకానికి సంబంధించిన విషయాలు. మనం ఏదైనా కష్టం వచ్చినా, ఎప్పుడైనా సంతోషం వచ్చినా అదీ స్వప్నమే, ఇదీ స్వప్నమే. పుట్టుక నిజంకాదు, చావు నిజంకాదు. అదీ స్వప్నమే, ఇదీ స్వప్నమే. ఏవో బాహ్యమైన ప్రక్రియల వలన ఈ సంసారచక్రంలో నుండి, ఈ మహాస్వప్నంలో నుండి విడుదలపొందలేము. ఈ మహాస్వప్నంలో నుండి విడుదలపొందాలంటే మన హృదయంలో ఉన్న వస్తువును తెలుసుకోవాలి, ఇంకో దారి లేదు. మనం భక్తిమార్గంలో గాని, కర్మమార్గంలో గాని, జ్ఞాన మార్గంలో గాని మొత్తం మీద ఏదోమార్గంలో ప్రయాణంచేసి నది వెళ్ళి సముద్రంలో కలిసినట్లుగా మనం హృదయంలో ఐక్యమవ్వాలి.

మీకు రాబోయేజన్మలు ఎటువంటి జన్మలు వస్తాయో మీరు జాగ్రత్తగా చూసుకొంటే మీకే తెలుస్తుంది. మీరు ఏకాంతంగా కూర్చొని మీ మనస్సులో ఉన్న బలహీనతలు ఏమిటో, మీకు ఉన్న కోరికలు ఏమిటో అన్నీ చూసుకొంటే దానిని బట్టే రాబోయేజన్మ ఇస్తాడు. భగవంతుడికి ఒకరిమీద ఇష్టం, ఒకరిమీద అయిష్టం ఏమీ ఉండదు. పూర్వజన్మలో మనం చేసిన పాపాలే ఈ జన్మలో మనకు రోగాలకింద వస్తాయి అని కొంతమంది అంటూ ఉంటారు. అయితే ఈ పాపాలు, ఈ పుణ్యాలు, ఈ రోగాలు అన్నీ స్వప్నమే కాని ఇది అంతా స్వప్నం అని ఇప్పుడు మనకు తెలియదు, మన హృదయంలో ఉన్న బంగారం మనకు అనుభవంలోనికి వచ్చినప్పుడు మనకు తెలుస్తుంది. బంగారం అంటే ఒకటి గుర్తుకు వస్తోంది. మనం రాముడిని, కృష్ణుడిని ఎలా ఆరాధిస్తామో అలాగ థాయ్‌లాండ్‌లో బుద్ధుడిని ఆరాధిస్తారు. మనం రాముడి విగ్రహం, కృష్ణుడి విగ్రహం ఎలా చేయించుకొంటామో అలాగ 100 సంవత్సరాల క్రితం అక్కడ ఒకరు బుద్ధుడి విగ్రహం చేయించి ఒక రోడ్డు సెంటరులో పెట్టి, ఎండవాన తగలకుండా దానికి కప్పు నిర్మించారు. రోడ్డు వెడల్పు చేయవలసి వచ్చి ఆవిగ్రహాన్ని తీసి ఇంకోచోట పెట్టాలను కొన్నారు. ఆ విగ్రహాన్ని తీసుకొని వెళుతూఉండగా విపరీతమైన వర్షం వచ్చింది, అది మట్టి విగ్రహం. ఎంత గొడుగులు పట్టినా మట్టి అంతా కరిగిపోయింది,

లోపల బంగారం ఉంది. అసలు అది బంగారువిగ్రహం. చేయించినవాడికి అదితెలుసు కాని ప్రజలు అందరూ మట్టివిగ్రహం అనుకొనేవారు. చేయించినవాడు ఏమనుకొన్నాడు అంటే బంగారం విగ్రహం అయితే ఎవడైనా పట్టుకొనిపోతాడు అని బుద్ధుడిమీద ప్రేమకొలది బంగారంతో విగ్రహం చేయించి ఎవరూ తీసుకొని వెళ్ళకుండా పైన దట్టంగా మట్టి పూసేసారు. ప్రజలు అది మట్టి విగ్రహం అనుకొని దానిజోలికి ఎవరూ వెళ్ళలేదు. ఇప్పటికీ థాయ్‌లాండ్‌లో ఆవిగ్రహం ఉంది. మట్టిపోయింది, బంగారం మిగిలింది. థాయ్‌లాండ్ ప్రజలు ఏమంటారు అంటే అది మట్టి విగ్రహం అని మేము అనుకొన్నాము. వర్షం వచ్చి మట్టి కరిగిపోయేవరకు అది బంగారపు విగ్రహం అని ఎవరికీ తెలియదు అంటారు. అలాగే మన హృదయంలో బంగారం ఉంది. అక్కడ మట్టి బంగారపు విగ్రహాన్ని మూసేసింది. మన మనస్సులో ఉన్న రాగద్వేషములనే మట్టి, మన హృదయంలో ఉన్న బంగారం మనకు కనబడకుండా చేస్తున్నాయి. బంగారపు విగ్రహం మీద ఉన్న మట్టి పోయినతరువాత బంగారపు విగ్రహం ఎలా వెలుగులోనికి వచ్చిందో అలాగే మన హృదయంలో ఉన్న బంగారం బహిర్గతం అవ్వాలంటే మన మనస్సులో ఉన్న మట్టి అంతా కరిగిపోవాలి. ప్రతీమనిషి అజ్ఞానంలో కూరుకొని పోవటానికి రాగద్వేషాలే కారణం అని బౌద్ధమతస్థులు చెపుతారు. మనం ఎన్నిరకాల సాధనలు చేసినా, పూజలు చేసినా, జపాలు చేసినా రాగద్వేషముల నుండి బయటకు రాకపోతే మనస్సుకు శాంతిరాదు, మనస్సుకు స్వచ్ఛతరాదు, మనస్సుకు సూక్ష్మతరాదు, ఇవి రానప్పుడు హృదయంలో ఉన్న బంగారం కూడా మనకు తెలియదు. ఏదైనా ఒక విషయం అర్థం కావాలంటే మనస్సుకి స్పష్టత ఉండాలి. మీరు ఏ ఊరు వెళుతున్నారు అని అడిగితే ఏ ఊరు వెళుతున్నామో మాకే తెలియదు అంటే అర్థం ఏమిటి? అసలు మన గమ్యం ఏమిటి? మనం పొందవలసింది ఏమిటి? మనకు ఒక అవగాహన ఉండాలి కదా.

మీరు పూజ చేయండి, జపం చేయండి, ధ్యానం చేయండి, సత్కర్మ చేయండి దానివలన పుణ్యం వస్తే రానివ్వండి. కాని పుణ్యం మీ లక్ష్యం కాకూడదు, మీ హృదయంలో ఉన్న సద్వస్తువును అనుభవైకవేద్యం చేసుకోవాలి, అది జీవితగమ్యంగా పెట్టుకో. జనక మహారాజు లోకక్షేమం కోసం నిరంతరం పనిచేసాడు, ఎప్పుడూ ఏదో ఒక సత్కర్మ చేస్తూనే ఉండేవాడు. కర్మచేసి ఆయన వ్యక్తిగతంగా పొందింది ఏమైనా ఉందా అంటే ఏమీలేదు, అలాగని ఆయన పనిచేయటం మానలేదు. జనకమహారాజును ఆదర్శంగా పెట్టుకొని పని చెయ్యి అని పరమాత్మ చెప్పాడు. నువ్వు చేసేది లోకక్షేమం కోసం సత్కర్మ చెయ్యి దానివలన లోకం ఉద్ధరింపబడుతుంది అనికాదు, నువ్వు ఉద్ధరింపబడతావు. మనం ఎవరికయినా

సహాయం చేసాము అనుకోండి వారిని ఉద్ధరిస్తున్నాము అని మనం అనుకోకూడదు, సహాయం చేయటానికి వారు మనకు అవకాశం ఇస్తున్నారు అనుకోవాలి. రాముడి రాజ్యంలో ఎవరికయినా పాలు పంపుదాము, మజ్జిగ పంపుదాము అనుకొంటే అయోధ్యలో తీసుకొనే వారు కనబడేవారు కాదు, ఎవరూ పుచ్చుకోకపోతే ఎవరికి ఇస్తాము. ఇప్పడు పుచ్చుకొనే వారు కనబడుతున్నారు, ఇచ్చేవారు కనబడటం లేదు.

మనం మంచిస్నేహాలు విడిచిపెట్ట కూడదు. మంచిస్నేహాలు విడిచిపెట్టేసాము అనుకోండి మనకు దుఃఖం మిగులుతుంది, అశాంతి మిగులుతుంది. ఇక్కడ అశాంతి పడ్డా పరవాలేదు చనిపోయిన తరువాత చీకటి లోకాలు మిగులుతాయి. ఆచార్యుడు అంటే ఎవడు? అని ఒకసారి శంకరాచార్యులవారు అడిగారు, అక్కడ ఉన్న ఒక భక్తుడు ఏమి చెప్పాడు అంటే రాముడా, శివుడా అని కాదు ఎవడైతే నా అజ్ఞానాన్ని పోగొడుతున్నాడో, ఎవడైతే నా వాసనలను క్షయం చేస్తున్నాడో వాడే ఆచార్యుడు అని చెప్పాడు, అద్భుతమైన సమాధానం, ఆ సమాధానానికి ఆచార్యులవారు కూడా ఆశ్చర్యపోయారు. మనం వాస్తవ పరిస్థితులకు దూరం అవ్వకూడదు, గాలిలో మేడలు కట్టవద్దు. మీ కుటుంబ పరిస్థితులు ఇతరులకు తెలియకపోయినా, మీకు తెలుసు కదా. ఆ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని జీవిస్తూ, ఆధ్యాత్మిక అభివృద్ధిని గమ్యంగా పెట్టుకోవాలి. మీకు దుఃఖం వస్తోంది అనుకోండి, దానికి బయట ఎవరో కారణం అని మీరు అనుకోవద్దు, మీ దుఃఖానికి మీరే కారణం అది బాగా అర్థం చేసుకోండి. మిమ్మల్ని మీరు అర్థం చేసుకోలేరు అనుకోండి మీకు వందకోట్లు ఉన్నా మీకు దుఃఖం వచ్చేస్తుంది, మిమ్మల్ని మీరు అర్థం చేసుకొంటున్నారు అనుకోండి, ఆత్మజ్ఞానసముపార్జనలో ఉన్నారు అనుకోండి మీకు ఏమీ లేకపోయినా మహాచక్రవర్తిలాగ ఉంటారు. ఏమీ లేనివారు కూడా గొప్ప ఆనందంగా ఉండటం నేను చూసాను, మనకు అన్నీ ఉండి ఇంక రోజూ ఏడవటమే పని అంటే మనకు జ్ఞానం లేదు అని అర్థం. మనల్ని మనం అర్థం చేసుకొంటూ ఉంటే, మన మనస్సు అంతర్ముఖం అవుతూ ఉంటే, రాగద్వేషములు తగ్గించుకొంటూ ఉంటే, మన బుద్ధికి సూక్ష్మత కలుగుతూ ఉంటే మనకు సుఖం తెలుస్తుంది, శాంతి తెలుస్తుంది, మనం ఎవరిగా ఉన్నామో దాని తాలుక ఎరుక మనకు కలుగుతుంది.

మనం అందరం ఈ దేహం నేను, దేహం నేను అనుకొంటాము కదా, మొత్తం రోగం అంతా ఈ దేహం నేను అనే తలంపులోనే ఉంది. పూసలదండలో ఆ పూసలన్నింటికి లోపల దారం ఆధారంగా ఉంది. అలాగే మనకు వచ్చే ఆలోచనలకు, తలంపులకు అన్నింటికీ దేహం నేను అనే తలంపు ఆధారంగా ఉంది. దేహము నేను అనే మొదటి తలంపు ఎంతకాలం

అయితే ఉందో అంతకాలం ఇతర తలంపులు వస్తూనే ఉంటాయి. ఉన్నది ఒక్కటే వస్తువు, ద్వితీయం లేనేలేదు. ఆ వస్తువునే జీవుడని, శరీరం అని, మరొకటి మరొకటి అని మనం అనుకొంటున్నాము. ఆ వస్తువును ఉన్నది ఉన్నట్లుగా అభివ్యక్తం చేసుకోలేకపోతే నీకు పునర్జన్మలు తప్పవు. ఓ అరుణాచలేశ్వరుడా! నీవు ఒక్కటే పనిగా పెట్టుకొన్నావు, రెండో పని నీకు లేదు. చెట్టు చుట్టూ తీగ ఎలా పాకుతుందో అలాగ ఎవడైతే నీ రూపం చుట్టూ, నామం చుట్టూ పాకుతున్నాడో, ఎవడైతే నిన్ను ఆశ్రయించాడో వాడి జీవలక్షణాలను పోగొట్టటమే పనిగా పెట్టుకొన్నావు. ఎప్పడైతే జీవలక్షణాలు అన్నీ కాలి బూడిద అయ్యాయో హృదయంలో ఉన్న సత్యవస్తువు ఎరుకలోనికి వస్తుంది. ఎక్కడయితే మనస్సు, ఇంద్రియాలు అణిగిపోయినాయో, ముక్కులో గాలి తిరుగుతున్నప్పటికీ ఎవడైతే చచ్చినవాడిలాగ బతుకుతున్నాడో వాడికి బ్రహ్మం ఎరుకలోనికి వస్తుంది. బ్రాహ్మీస్థితి పొందినవాడిని ఈ సృష్టి ఏమీ చేయలేదు, వాడు ఈ సృష్టిలో నుండి విడిపోతాడు. అంటే లోకం ఉండగానే వాడు లోకానికి అతీతం అవుతాడు, దేహం ఉండగానే ఈ దేహానికి అతీతం అవుతాడు. దేహం చనిపోతున్నప్పడు కూడా నేను చనిపోతున్నాను అనే తలంపు వాడికి ఉండదు, పైగా ఈ దేహానికి చేసే చాకిరి పోతుంది అనుకొంటాడు. మనకు ముసలితనం వస్తోంది అంటే చావు దగ్గరికి వస్తోంది అని అర్థం. అందుచేత మనం ముసలివారము అయిపోయాము, పని, పాటూ లేకుండా కూర్చొందాము అనుకోవద్దు. ఇంక నాలుగు సంవత్సరాలో, అయిదు సంవత్సరాలో టైము ఉంటే ఆ కాలాన్ని మీరు పూర్తిగా సద్వినియోగం చేసుకొని బ్రాహ్మీస్థితిని పొందాలి. మనందరకు డబ్బు విలువ తెలుసుగాని కాలం విలువ తెలియదు. అందరూ కాలాన్ని పాడుచేసుకొంటున్నారు. చనిపోయే రోజు వచ్చేసింది అనుకోండి ఇంక సాధన ఎక్కడ చేస్తాము. డబ్బుకంటే ముఖ్యమైనది కాలం. డబ్బుపోతే మనం తిరిగి సంపాదించుకోవచ్చు కాని జరిగిపోయిన కాలం మరల తిరిగిరాదు.

24 గంటలు మనం లోకం గొడవలలో ఉంటున్నాము, ఈ లోకం గొడవలు మనం నరకానికి వెళ్ళటానికి మెట్లు కడతాయి. కొన్ని సత్సంగాలు ఎలా ఉంటాయి అంటే ఒక అరగంట ఏదో ఒకటి చదివేస్తారు తరువాత ఊరిలో గొడవలు అన్నీ చెప్పకొంటారు. మనకు నరకానికి వెళ్ళే యోగం ఉంది కాబట్టి లోకాన్ని విడిచిపెట్టలేకపోతున్నాము. నీ పని ఏదో నీవు చూసుకో, అస్తమాను లోకం గొడవలలోనికి వెళితే నీకు పతనం తప్పదు అని భగవాన్ చెప్పారు. లోకం గొడవలు చెప్పకోవటం వలన భౌతికంగా మనకు ఏదైనా లాభం ఉందా అంటే ఏమీ లాభం లేదు, చనిపోయిన తరువాత చీకటి లోకాలు అంటే అక్కడసున్నా, ఇక్కడా

సున్నా. కొంతమందికి అస్తమానుదేహం గొడవ, లేకపోతే లోకం గొడవ ఇటువంటి మనకా ఆత్మజ్ఞానం కలిగేది? మొత్తం ఈ సృష్టి కంతకు ఏ వస్తువు అయితే ఆధారంగా ఉందో, ఏ వస్తువులో ఈ సృష్టి అంతా లయమవుతోందో అది మనమై ఉన్నాము. అట్టి ఆనంద వస్తువే మనం అయినప్పుడు ఇంక మనకు ఎందుకు దుఃఖం వస్తోంది? ఆనంద వస్తువు మనకు ఎరుకలో లేకపోవటం వలన మనకు దుఃఖం వస్తోంది. అహంబ్రహ్మాస్మి అనేది అనుభవానికి సంబంధించిన మహావాక్యము. లోపల అనుభవం లేదు అనుకోండి వూరికే అహంబ్రహ్మాస్మి అహం బ్రహ్మాస్మి అని అనుకోవటం వలన ప్రయోజనం లేదు. నీ లోపల బ్రహ్మం ఎంత లోతులలో ఉందో అంత లోతులలోనికి నీవు వెళితేకదా అది నీకు దొరికేది. వాక్కును నియమించి, ఇంద్రియాలను నియమించి, మనస్సును నియమించి నీవు లోపలకు వెళితే లోపల బ్రహ్మం నీకు ఎరుకలోనికి వస్తుంది. నీవు కష్టపడి విద్యను సంపాదించటం కంటే, కష్టపడి ధనం సంపాదించటం కంటే భక్తిని సంపాదించటం చాలా కష్టం. అందులో ఉన్న కష్టం వారికి తెలియక భక్తి లేనివారు ఏమనుకొంటారు అంటే ఏదో భక్తులు కదా అనుకొంటారు. వారికి తెలియకపోవటం వలన అలా అనుకొంటున్నారు, దానిలో వారి పొరపాటు ఏమీ లేదు. మీరు భక్తిని సంపాదించారా మీకు ముక్తి వచ్చేసినట్లే. మీ చేతిలో డబ్బు ఉండాలి కాని బజారుకు వెళ్ళి చీర ఎంతసేపు కొనుక్కొంటారు అలాగే మీకు భక్తి ఉండాలి కాని ముక్తి ఎంతసేపు వస్తుంది. భక్తి అనేది పైనుంచి పోసేదికాదు, లోపల నుండి ఊరాలి. అసలు మనం చేసే సహవాసాలే మంచివి కానప్పుడు ఇంక మనకు భక్తి ఎలా వస్తుంది, సుఖం ఎలా తెలుస్తుంది. సహవాసం మంచిది కాకపోతే ఆత్మజ్ఞానం పొందాలి అనే సంకల్పం కూడా మనకు రాదు.

మీరు ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలి. శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం మనం కాపాడుకోకపోతే సాధన చేయలేము. సాధన లేకపోతే సిద్ధి కలుగదు. మోక్షాన్ని పొందటమే గమ్యంగా పెట్టుకొన్నప్పుడు మోక్షం పొందటానికి తగిన సామాగ్రిని ఎలా సంపాదించుకోవాలో జాగ్రత్తగా చూసుకోవాలి. మోక్షం పొందటానికి మనలో ఏవైతే ఆటంకాలుగా ఉన్నాయో, ఆ ఆటంకాలను ఎలా తొలగించుకోవాలో మనం ప్లాన్ చేసుకోవాలి. నువ్వు ఏ వస్తువును పొందటానికి జన్మల తరబడి ప్రయత్నం చేస్తున్నావో అది నీ హృదయంలోనే ఉంది. కాని అది నీకు ఎందుకు తెలియటం లేదు అంటే నీ ప్రయత్నంలో చిత్తశుద్ధి లేదు. నువ్వు చేసే ప్రయత్నంలో ఎక్కడో దోషం ఉంది. కొంతమంది మనస్సును ఎప్పుడూ భౌతిక విషయాల మీద పెట్టుకొంటారు, నోరు ఏమో రామ రామ అంటూ ఉంటుంది. అది నీ

లోపల ఉన్న రాముడు చూస్తూ ఉంటాడు. మనస్సును విషయాలకు ఇచ్చేసాడు, నోటితో రామ రామ అంటున్నాడు, వీడు నన్ను మోసం చేయటానికి చూస్తున్నాడు అని ఆయన అనుకొంటాడు. నీవు ఏదైనా ఒక పని చేయాలనుకొన్నప్పడు నీకు ఉన్న తెలివిని, శక్తిని ఉపయోగించి ఆ పనిని సాధించటానికి నువ్వు ఎంత ప్రయత్నం చేస్తావో అలాగే బ్రాహ్మీస్థితిని పొందటానికి నీ ఇంద్రియాలను, నీ మనస్సును, నీకు ఉన్న తెలివిని ఉపయోగించాలి, నీకు ఉన్న పుణ్యాన్ని పెట్టుబడిగా పెట్టి ఇన్ని రకాలుగా ప్రయత్నం చేస్తేగాని లోపలఉన్న వస్తువు నీకు తెలియదు. మనస్సులో ఒకటి పెట్టుకొని, నోటితో ఇంకోటి చెపుతూ, చేతితో మరొకటి చేస్తూ ఉంటే నీకు లోపలఉన్న వస్తువు ఎలా తెలుస్తుంది.

ఈశ్వరుని దయకు పాత్రుడవు అవ్వటానికి నీవు త్రికరణశుద్ధిగా పనిచేయాలి. త్రికరణ శుద్ధిగా పనిచేయకపోతే నీకు అంతఃకరణ శుద్ధిరాదు, అంతఃకరణ శుద్ధి లేనివాడికి కోటి జన్మలు ఎత్తినా ఆత్మజ్ఞానం రాదు. నీ బుద్ధి పవిత్రం కాకపోతే పరమపవిత్రుడైన ఈశ్వరుడు నీకు ఎలా ఎరుకలోనికి వస్తాడు, వాడిని నీవు మోసం చెయ్యగలవా? మన నిజమైన ఇల్లు మన హృదయంలోనే ఉంది. కాని ఇష్టా, అయిష్టాలనే గాలి మనం ఎంత ప్రయత్నం చేసినా లోపలకు వెళ్ళనివద్దు, ముందు వాటిని తగ్గించుకోవాలి. ఎప్పడు ఏది అవసరమో భగవంతుడు చూస్తాడు, ఆయనను తొందరపెట్టవలసిన పని లేదు. తీగ చెట్టును ఏ విధంగా పట్టుకొని ఉంటుందో అలాగ నీవు ఈశ్వరుని పట్టుకొని ఉంటే నీకు ఏది మంచిదో ఆయనే చూసుకొంటాడు. నువ్వు పరమేశ్వరుని చుట్టుకొనిపోతూ ఉంటే నీకు అన్యచింతలు ఎందుకు వస్తాయి, రానే రావు. నువ్వు ఎంత సాధన చేస్తున్నప్పటికీ ఇంద్రియాలతో, మనస్సుతో, వాక్కుతో ఈశ్వరుడిని చుట్టుకోకపోతే నా మాయ మటుకు నీకు దారి ఇవద్దు అని పరమాత్మ చెపుతున్నాడు. నువ్వు ఎంతో సాధన చేస్తున్నప్పటికీ భగవంతుడి పాదాలను ఆశ్రయించాలి. అప్పడు మాయ దారి ఇస్తుంది. మాయ దారి ఇవ్వకపోతే నువ్వు ఎంత సాధన చేసినా నీకు మోక్షం లేదు. ఈ లోకం మంచిది కాదు, చెడ్డదీ కాదు. ఒక చెట్టు ఉంది అనుకోండి. ఆ చెట్టు కింద నీడకోసం ఒకడు కూర్చోవచ్చు, ఆ చెట్టుకే ఒకడు ఉరివేసుకోవచ్చు. నీడలో సుఖంగా కూర్చోమని ఒకడికి ఆ చెట్టు చెప్పటం లేదు, ఉరిపోసుకోమని ఒకడికి ఆ చెట్టు చెప్పటం లేదు. వారి బుద్ధిని బట్టి వారు అలా చేస్తున్నారు. అలాగే ఈ లోకం మంచిదీ కాదు, చెడ్డదీ కాదు. నీ బుద్ధితో ఈ లోకాన్ని జాగ్రత్తగా ఉపయోగించుకొని నీవు బాగుపడు. ఈ లోకంలోనికి నీవు ఎందుకు వచ్చావో అర్థం చేసుకో. నువ్వు వచ్చిన పని పూర్తి చేసుకొని వెళ్ళిపో. ఆ వెళ్ళిపోవటంలో కూడా నువ్వు ఈ లోకంలోనికి వచ్చి వెళ్ళావనే గుర్తు కూడా

లేకుండా వెళ్ళిపోవాలి. అప్పుడు నీకు ఈశ్వరుని దయ కలుగుతుంది. అంటే నీ పని ఏదో నీవు శ్రద్ధగా చేసుకో, గుర్తింపులు కోరుకోవద్దు.

బంధం లేదు, మోక్షం లేదు అంటున్నారు, నిజంగా బంధం లేదు అనుకోండి నాకు దుఃఖం ఎందుకు వస్తోంది? అని భగవాన్‌ను అడుగుతున్నారు. నీవు బంధంలో ఉన్నాను అనుకొంటున్నావు కాబట్టే నీవు మోక్షాన్ని కోరుకొంటున్నావు. నువ్వు బంధంలో లేవు అన్న సంగతి నీకు తెలిస్తే మోక్షాన్ని కోరుకోవు. నువ్వు అసలు బంధంలో లేవు, మోక్షంలోనే ఉన్నావు. ఆ సంగతి నీకు తెలిస్తే, అది నీకు అనుభవంలోనికి వస్తే మోక్షాన్ని కోరుకోవు. నీకు ఉన్న దుఃఖం నిజంకాదు, సుఖం నిజం కాదు, చావుపుట్టుకలు నిజంకాదు, పుణ్యం నిజం కాదు, పాపం నిజంకాదు, నీ మంచి ప్రారబ్దం నిజంకాదు, చెడు ప్రారబ్దం నిజంకాదు, ఇదంతా స్వప్నమే. నీ హృదయంలో ఉన్న నిజం నీకు తెలియటం లేదు కాబట్టి నిజం కానిది నిజం వలె నీకు కనిపిస్తోంది. నీ స్వరూపం నుండి నీవు జారిపోయావు కాబట్టి దాని తాలుక ఎరుక నీకు లేదు కాబట్టి ఈ సంతోషం, దుఃఖం, చావు పుట్టుకలు, ఈ అల్లకల్లోలం అంతా నిజంలాగ కనిపిస్తున్నాయి, అందుచేత అందులో నుండి నీకు ప్రతిస్పందన వస్తోంది. నీ శరీరానికి సంబంధించిన చావు కూడా నిజంకాకపోయిన నిజం వలె నీకు కనిపిస్తోంది కాబట్టి దుఃఖానికి గురి అవుతున్నావు. ఈ లోకంలో ఉన్న ప్రేమలు నిజం కాదు, అది మోహం. అది మోహం అని తెలియక మోహాన్నే మనం ప్రేమ అనుకొంటున్నాము. మీ దేహం కంటే నా దేహం అంటే నాకు ఎక్కువ ఇష్టం. ఇక్కడ ఇన్ని దేహాలు ఉండగా నా దేహం అంటేనే నేను ఎందుకు ఇష్టపడుతున్నాను. మీ దేహంలో ఏది ఉందో నా దేహంలోనూ అదే ఉంది మరి నా దేహం అంటేనే నేను ఇష్టపడుతున్నాను ఏమిటి? అలా ఇష్టపడటానికి అహంకారం, మమకారం కారణం, ఇది బాగా అర్ధం చేసుకోండి.

ఒకవేళ అరుణాచలేశ్వరుడు నీకు సుఖం తీసుకొని వచ్చినా, దుఃఖం తీసుకొని వచ్చినా, ఎప్పడయినా నిన్ను ముద్దాడినా, నిన్ను మొట్టికాయలు మొట్టినా, నీకు శాంతి తీసుకొని వచ్చినా, అశాంతి తీసుకొని వచ్చినా ఎన్ని రకాలుగా నీతోటి ఆడుకొన్నా ఆయన లక్ష్యం ఒక్కటే, నీలోని జీవలక్షణాలను తొలగించటమే ఆయన పని, ఇంకొక పని ఏమీ లేదు. భీష్ముడు ప్రాణం పోయేముందు కర్ణుడు కూడా అక్కడకు వస్తాడు. అప్పుడు భీష్ముడు అంటాడు, కర్ణా నిన్ను చాలా కఠినమైన మాటలు అన్నాను, నీకు కష్టం కలిగించే మాటలు మాట్లాడాను. భీష్ముడు అంతటివాడు ఇలా మాట్లాడుతున్నాడు ఏమిటి? అని లోకం అనుకోవచ్చు. లోకం ఏదో ఒకటి అనుకొంటుంది, లోకం గొడవ కాదు. నిన్ను అంత కఠినంగా ఎందుకు అన్నాను

అంటే నీవు ధుర్యోధనుడి స్నేహం విడిచిపెడతావనే ఉద్దేశ్యంతో అంత కఠినంగా మాట్లాడాను. నువ్వు అంటే ఇష్టంలేక కాదు, నీమీద ప్రేమతో, నీవు బాగుపడాలనే అలా మాట్లాడాను అంటాడు. అక్కడ భీష్ముడి హృదయం చూడండి కర్ణుడి లాంటి వాడిని కూడా రక్షించటానికి చూసాడు. ఆయన మాట కాదు, ఆయన హృదయాన్ని మనం గ్రహించాలి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 14-12-05, అరుణాచలం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మనం వచ్చినపని మర్చిపోకూడదు అని భగవాన్ అనేవారు. మనం ఏ పని నిమిత్తం అరుణాచలం వచ్చామో ఆ పని మర్చిపోకూడదు. మనం భక్తిని అభివృద్ధి చేసుకోవటానికి అరుణాచలం వచ్చాము, అది మర్చిపోవద్దు. మౌనం వలన కలహాలు తగ్గిపోతాయి, మీరు తక్కువగా మాట్లాడండి. మనం జీవితంలో క్రమశిక్షణ నేర్చుకోవాలి. క్రమశిక్షణ లేకపోతే ఎంత ధనం ఉన్నా, ఎంత పాండిత్యం ఉన్నా మనం సుఖపడలేము. క్రమశిక్షణ లేకపోతే భౌతికంగాను, ఆధ్యాత్మికంగాను అభివృద్ధిలోనికి రాలేము. మనం కాలాన్ని పాడుచేసు కొంటున్నాము, మానవజన్మను వృధా చేసుకొంటున్నాము. మానవజన్మ రావటం కష్టం. మానవజన్మకు వివేకం, విచక్షణ ఉంటుంది కాని చెట్టుకు, జంతువుకు ఉండదు. జపం లేకుండా, ధ్యానం లేకుండా, ఏవిధమైన సాధనలు చేయకుండా మానవజన్మను వృధా చేసుకోవటం ఎటువంటిది అంటే మన ఇంటికి బంధువులు వస్తే రూపాయికాగితాలు పొయ్యిలో పెట్టి కాఫీ కాసినట్లుగా ఉంటుంది. మరల మానవజన్మ వస్తుందో రాదో చెప్పలేము, మీరు కాలాన్ని పాడుచేసుకోవద్దు, వచ్చిన అవకాశములను పోగొట్టుకోకూడదు. తెలివైన వారికి అవకాశములు వస్తాయి, వారు వాటిని పట్టుకొంటారు, అభివృద్ధిలోనికి వస్తారు. తెలివి తక్కువ వారికి అవకాశములు వస్తాయి, వారు వాటిని వదిలేస్తారు, పాడైపోతారు. తెలివైన వాడికి పురోగతి, తెలివితక్కువ వాడికి తిరోగతి.

వివాహసమయంలో పెండ్లికుమారునికి పెండ్లికుమార్తె దండవేయటం, పెండ్లి కుమార్తెకు పెండ్లికుమారుడు దండవేయటం జరుగుతుంది. అక్షరమణమాల ఇది పెండ్లి నాటిమాల. ఇక్కడ రమణమహర్షి అనే పెండ్లికుమార్తె అరుణాచలేశ్వరుడు అనే పెండ్లి కుమారుడికి దండవేసింది. నేను అక్షరాలతో తయారుచేసిన దండను నీకు వేస్తున్నాను, నీ అనుగ్రహం అనే దండను నా మెడలో వేయి అని అర్థిస్తున్నాడు. ఒక్క విషయం మీరు గుర్తుపెట్టుకోండి. మీరు ప్రధానమంత్రి చేసినా, రాష్ట్రపతి చేసినా, మీ పేరు ప్రపంచం అంతా వ్యాపించినా, మీకు వేయి కోట్లు డబ్బు ఉన్నా, పాండిత్యం ఉన్నా మీకు దుఃఖం నశించదు.